# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :277 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 12-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## కర్ణాటకలో మళ్లీ బీర్ల ధరల బాదుడు!

బెంగళూరు,కర్ణాటకలో బీర్ల రుచి చేదెక్కనుంది! వాటి ధరల పెంపునకు సంబంధించి శుక్రవారం సిద్ధరామయ్య సర్కారు తుది నోటిఫికేషన్ జారీ చేసింది. సీఎం అంతిమ నిర్ణయం తీసుకొంటే ఈ నెల 20 నుంచే ఈ ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ మంత్రి తిమ్మాపూర్ తెలిపారు. దీంతో ఈ సారి ధరలు పెరిగితే ఏడాది వ్యవధిలో మూడోసారి వినియోగదారులపై కాంగ్రెస్ సర్కారు ధరల భారం మోపినట్టవుతుంది.తాజా నోటిఫికేషన్ ప్రకారం ధరలు అమలైతే బీర్ల ధరలు ఏకంగా 10–20 శాతం పెరుగుతాయి. ధరలు ఇలా పెరిగితే తమ వ్యాపారాలు దెబ్బ తింటాయని, దాని ప్రభావం పర్యాటకంపైనా పడుతుందని బీర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారి 2023 రాష్ట్ర బడ్జెట్‌లో బీర్ల ధరలను పది శాతం పెంచడం వల్ల 650 మి.లీ బీర్ సీసా ధర రూ.10–15 పెరిగింది. ఆ తర్వాత గతేడాది ఫిబ్రవరిలో మరోసారి ధరలు 10 శాతం పెంచడం వల్ల అదే బీర్ సీసా ధర రూ.15 పెరిగింది.

## సుంకిశాల ఘటనపై విజిలెన్స్ నివేదికను తొక్కిపెట్టడం దారుణం



హైదరాబాద్ : సుంకిశాల ఘటనపై విజిలెన్స్ నివేదికను సమాచార హక్కు చట్టం కింద ఇవ్వకుండా తొక్కిపెట్టడం దారుణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఒక నిర్మాణ సంస్థ చేసిన ఘోర తప్పిదాన్ని.. దేశ రక్షణకు సంబంధించిన సమాచార హక్కు సెక్షన్లతో ముడిపెట్టి దాచడం మరింత విడ్డూరమని కేటీఆర్ ధ్వజమెత్తారు.మేఘా సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలనే కమిటీ రిపోర్ట్‌ను ప్రభుత్వం రహస్యంగా ఉంచడానికి ప్రధాన కారణం సీఎం రేవంత్ – మేఘా కృష్ణారెడ్డికి మధ్య కుదిరిన చీకటి ఒప్పందమే అని కేటీఆర్ పేర్కొన్నారు. సుంకిశాలలో మేఘా సంస్థ నిర్లక్ష్యం వల్ల రిటైనింగ్‌వాల్ కూలి రూ. 80 కోట్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న తాగునీటి అవసరాలు తీర్చే సంకల్పానికి గండిపడింది. నిర్మాణ లోపం బయట పడుతుందనే భయంతోనే కమిటీ నివేదికను బహిర్గతం చేయడానికి కాంగ్రెస్ సర్కారు జంకుతోంది. సమాచారాన్ని దాచడం అంటే జరిగిన తప్పును ఒప్పుకున్నట్టే కదా అని కేటీఆర్ పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని దుమ్మెత్తిపోసిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారు. తన జేబు సంస్థగా మార్చుకుని ఢిల్లీ పెద్దల ధనదాహాన్ని తీర్చేందుకు పావుగా వాడుకుంటున్నారు. బ్లాక్‌లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి రూ.4,350 కోట్ల కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేక్ కోసినట్టు చెరిసగం పంచిపెట్టి భారీ కుంభకోణానికి తెరతీశారు. ఇప్పటికైనా సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను మానుకోవాలని, సుంకిశాల ఘటనపై ప్రభుత్వం చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## వాళ్లకు మాత్రమే రూ.12 వేలు ఇస్తాం..

హైదరాబాద్,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హుల ఎంపికపై సీఎం రేవంత్ సంచలన ప్రకటన చేశారు. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన కుటుంబాలకే ఈ పథకం వర్తిస్తుందని సీఎం తెలిపారు. ఈ పథకానికి సంబంధించి గైడ్ లైన్స్ ఫైనల్ చేయాలని సీఎం సూచించారు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హుల ఎంపికపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. భూమి లేని నిరుపేద కూలీ కుటుంబాలను ఆదుకునేందుకే ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టుగా ఇప్పటికే ప్రకటించారు సీఎం. అయితే ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన కుటుంబాలకే ఈ పథకం వర్తిస్తుందని సీఎం తెలిపారు. ఈ పథకానికి సంబంధించి గైడ్ లైన్స్ ఫైనల్ చేయాలని నిన్న కలెక్టర్లతో జరిగిన సమావేశంలో సీఎం సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులకు తెలంగాణ గవర్నమెంట్ రూ.12 వేలు అందించనుంది. 2025 జనవరి 26 నుంచి రైతుభరోసా ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ కలెక్టర్ల సమావేశంలో వెల్లడించారు. సాగుయోగ్యమైన ప్రతీ ఎకరాకి రైతుభరోసా చెల్లిస్తామన్నారు. పంట వేసినా, వేయకున్నా నగదు చెల్లిస్తామన్నారు. అనర్హులకు రైతుభరోసా ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి స్థిరాస్తి, లే ఔట్‌లు, నాలా కన్వర్షన్ అయిన, మైనింగ్, ప్రాజెక్టులకు సేకరించిన భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు సీఎం. అర్హుల ఎంపిక పక్కాగా జరగాలి.గత బీఆర్ఎస్ సర్కార్ .. సాగుయోగ్యం కాని భూములకు కూడా పెట్టుబడి సాయం అందించిందని అలాంటి తప్పులు జరగకుండా చూడాలని కలెక్టర్లను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతో పాటు కొత్త రేషన్ కార్డుల జారీకి



అర్హుల ఎంపిక పక్కాగా జరగాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. జనవరి 11 నుంచి 15లోగా ఈ పథకాల అమలుకు అవసరమైన గ్రౌండ్ వర్క్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇక గతంలో ఉన్న నిబంధనల ప్రకారమే కొత్త రేషన్ కార్డు లను మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఒక కుటుంబానికి ఒకేచోట రేషన్ కార్డు ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో వన్ స్టేట్.. వన్ రేషన్ అనే విధానాన్ని తీసుకువస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజా ప్రభుత్వం రెండు కళ్లలా భావిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కలెక్టర్లు తమ పనితీరును ఇంకా మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నెలలో ఒక్కసారైనా హాస్టల్స్ విజిట్ చేసి అక్కడే రాత్రి బస చేయాలన్నారు. మహిళా అధికారులు బాలికల హాస్టల్స్‌కు వెళ్లి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపాలని చెప్పారు. పనులలో నిర్లక్ష్యం కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. జనవరి 26 తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు.

## నల్గొండ ఇంటలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై వేటు..

నల్గొండ:నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై వేటు పడింది. ఆమెను డీజీపీ ఆఫీసుకి ఎటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.అక్రమాలు, వసూళ్ల ఆరోపణలతో ఆమెపై ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. సొంత సిబ్బందిని సైతం వదలకుండా ఇంటలిజెన్స్ ఎస్పీ భారీగా డబ్బు వసూళ్లు చేసినట్లు టాక్. ఆమె అవినీతిపై సొంత శాఖ సిబ్బందే ఉన్నతాధికారులకు 9 పేజీల లేఖను రాశారు. ఇంటెలిజెన్స్ విభాగంలో పోస్టింగ్‌ల కోసం లంచాలు తీసుకున్నట్లు ఆరోపించారు. అంతేకాకుండా సిబ్బందితో అధిక వడ్డీ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం చేయించినట్లు వారు లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ ఆధారంగా ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా.. గంజి కవిత బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి.అయితే, నల్గొండ జిల్లా ఇంటెలిజెన్స్ అధికారిగా గంజి కవిత ఏడేళ్ల పాటు విధులు నిర్వహించారు. ఈ ఏడేళ్లలో ఆమె రేషన్, గుట్కా మాఫియాల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. అలాగే, ఓ ఎస్ఐతో పాటు నలుగురు కానిస్టేబుళ్లతో కవిత ఈ దందా కొనసాగించినట్లు సమాచారం.




దీంతో గంజి కవిత షాడో టీంపైనా దర్యాప్తు కొనసాగుతోంది. సమగ్ర విచారణ తర్వాత ఆమెను సస్పెండ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల నూతన ఇంటలిజెన్స్ అధికారిగా శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

## అనుమానాస్పదస్థితిలో ఆప్ ఎమ్మెల్యే మృతి



న్యూఢిల్లీ : పంజాబ్‌లోని లుధియానా వెస్ట్ నియోజకవర్గం ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. ఎమ్మెల్యే గురుప్రీత్ గోగి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఎమ్మెల్యే మృతిపట్ల ఆప్ నాయకత్వం సంతాపం ప్రకటించింది.శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఎమ్మెల్యే గురుప్రీత్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన తలలో రెండు బుల్లెట్ గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు తనకు తానే ఆయన కాల్చుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తలలోనే రెండు బుల్లెట్ గాయాలు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఆస్పత్రికి తరలించే లోపే ఎమ్మెల్యే ప్రాణాలు విడిచినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.గురుప్రీత్ గోగి 2022లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు.లుధియానా వెస్ట్ నియోజకవర్గంలో పంజాబ్ మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే భరత్ భూషణ్‌ను గురుప్రీత్ ఓడించారు. ఆయ నపై 7,500 ఓట్ల మెజార్టీతో గోగి గెలుపొందారు. ఇక శుక్రవారం పంజాబ్ స్పీకర్ కుల్తార్ సంధ్వాన్‌తో కలిసి లోహ్రీ ఫంక్షన్‌కు ఎమ్మెల్యే గోగి అటెండ్ అయ్యారు.

## ఇండియా కూటమి మూడేళ్లలోనే ముగుస్తుందా ?




న్యూఢిల్లీ,ఎన్డీయే కూటమికి పోటీగా మూడేళ్ళ క్రితం దేశంలో ఏర్పాటు అయింది ఇండియా కూటమి. ఇందులో జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్ కమ్యూనిస్టులతో పాటు కీలకమైన ప్రాంతీయ పార్టీలు జట్టుగా ఉన్నాయి. అన్నీ కలసి ఎన్డీయేను నిలువరించాలన్నది ఒక భారీ లక్ష్యంగా పెట్టుకున్నాయి. చూస్తే 2024 లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అనుకున్న ఫలితాలు సాధించలేక చతికిలపడింది.అయితే ఇండియా కూటమికి అతి పెద్ద సమస్య ఏంటి అంటే నాయకత్వ సమస్య. ఇండియా కూటమి కట్టాలన్న ప్రతిపాదనను బీహార్ సీఎం నితీష్ కుమార్ తీసుకుని వచ్చారు. ఆయన ప్రధాని పీఠం మీద కన్నేసి ఎన్డీయే కూటమి నుంచి జరిగి విపక్షం వైపుగా వచ్చినదే అందుకు. ఆయన అన్ని పార్టీల గుమ్మం ఎక్కి జాతీయ స్థాయిలో బలమైన కూటమి కావాలని ప్రతిపాదించారు.అందుకు ఆయనకు తెర వెనక కాంగ్రెస్ కూడా సాయం అందించింది. తీరా తొలి సమావేశంలోనే నితీష్ కుమార్ కి కన్వీనర్ బాధ్యతలు అప్పగిస్తారు అనుకుంటే అది జరగలేదు. ఆ తరువాత ఇండియా కూటమి తీరు చూసి నితీష్ మళ్లీ ఎన్డీయే వైపు మళ్ళారు. దాని వల్ల లోక్ సభ ఎన్నికల్లో ఆయన లాభపడ్డారు కూడా ఎక్కువ ఎంపీ సీట్లు సాధించి కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్రని పోషిస్తున్నారు.ఇక నితీష్ ఒక్కరే కాదు చాలా మందికి ఇండియా కూటమి సారధ్యం వహించాలని కోరిక ఉంది. అందులో లాలూ యాదవ్, శరద్ పవార్ మమతా బెనర్జీ వంటి వారు ఉన్నారు. ఇపుడు అంతా కలసి మమతకు ఇండియా కూటమి బాధ్యతలు అప్పగించమని కోరుతున్నారు. ఈ విషయం అలా ఉండగానే ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ తో పొత్తు లేకుండా ఆప్ పోటీకి దిగింది అయితే పదిహేనేళ్ళ పాటు ఢిల్లీని పాలించిన పార్టీగా కాంగ్రెస్ కూడా పోటీ పడుతోంది.సరిగ్గా ఇక్కడే ఇండియా కూటమికి బీటలు వారే పరిణామాలు సంభవించాయి. ఆప్ కి ఢిల్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ అఖిలేష్ యాదవ్ లాలూ యాదవ్ తో సహా కీలక పార్టీల నాయకత్వమంతా మద్దతుగా నిలిచారు. ఆ విధంగా కాంగ్రెస్ ని ఒంటరి చేశారు. ఇండియా కూటమి నాయకత్వం డిమాండ్ తరువాత వచ్చిన కీలక పరిణామంగా దీనిని చూస్తున్నారు.ఇండియా కూటమిని రద్దు చేయాలని కూడా సరికొత్త డిమాండ్ దీనితో పాటే వినిపిస్తోంది. ఈ విధంగా డిమాండ్ చేసిన వారు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత కాశ్మీర్ సీఎం అయిన ఒమర్ అబ్దుల్లా. కేవలం లోక్ సభ ఎన్నికల్లోనే పోటీ కోసం కట్టిన కూటమి కాబట్టి దానిని రద్దు చేయడమే మంచిదని ఆయన అంటున్నారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తరువాత ఇండియా కూటమి పార్టీల సమావేశం నిర్వహించి దీని మీద నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ఇదిలా ఉంటే మహారాష్ట్ర ఎన్నికల తరువాత ఇండియా కూటమిలో విభేదాలు పెరిగాయని అంటున్నారు. కాంగ్రెస్ ని తప్పుకుని మమతా బెనర్జీకి బాధ్యతలు అప్పగించమని డిమాండ్ అలా వచ్చినదే.దీని మీద కాంగ్రెస్ అధినాయకత్వం మౌనం వహిస్తోంది. ఇపుడు ఏకంగా ఇండియా కూటమినే రద్దు చేయమని డిమాండ్లు వస్తున్నయి. దాంతో ఎన్డీయేకి పోటీగా పుట్టిన ఇండియా కూటమి మూడేళ్ళలోనే ముగుస్తుందా అన్న చర్చ సాగుతోంది. బహుశా ఢిల్లీ ఎన్నికల తరువాత ఇండియా కూటమి జాతకం తేలనుంది అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## సంక్రాంతికి పల్లెబాట పట్టిన ప్రజలు.. టోల్ ప్లాజాల దగ్గర భారీగా ట్రాఫిక్!

హైదరాబాద్,బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వచ్చిన వారందరు ఇప్పుడు సంక్రాంతి పండగ కోసం పల్లెలకు పయనం అవుతున్నారు. ఇప్పటికే చాలా మంది ప్రజలు వారి స్వగ్రామాలకు చేరుకోగా..మరి కొందరు సొంతూళ్లకు వెళ్తున్నారు. పండుగ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు ఈ నెల 11 నుంచి 19 వరకు హాలీడేస్ ఇచ్చాయి. తిరిగి జనవరి 20వ తేదీన తరగతులు పునః ప్రారంభం కానుండటంతో.. స్కూల్స్, వసతి గృహాల్లో చదువుకుంటూన్న స్టూడెంట్స్ తమ ఊళ్లకు వెళ్లేందుకు బస్ స్టేషన్, రైల్వే స్టేషన్లకు చేరుకుంటున్నారు. రద్దీ కారణంగా బస్సులో సీట్లు లేకపోవడంతో నిలబడే తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు.ఇక, హైదరాబాద్ పట్టణ పరిధిలోని ప్రధాన బస్ స్టాప్‌ల దగ్గర జనం బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్సులు రాగానే తమ గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే ఆత్రుతతో సీట్ల కోసం ఎగబడుతున్నారు. మరోవైపు చాలా మంది సొంత వాహనాలు ఉన్న వారు కుటుంబంతో సహా కార్లు, మోటర్ సైకిళ్ల మీద తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి , కేతేపల్లి మండల పరిధిలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజాల దగ్గర భారీగా ట్రాఫిక్



జామ్ అయింది. కిలో మీటర్ల మేర వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ ఫోర్స్ బరిలోకి దిగింది. అలాగే, నగరంలోని అమీర్‌పేట్, కూకట్‌పల్లి, పెద్ద అంబర్ పేట్, ఆరాంఘర్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్ అయినట్లుగా సమాచారం. ఈ ట్రాఫిక్ తో ప్రయాణికులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## ప్రైవేటు బస్సులపై ఆర్టీఏ కొరడా... 11 బస్సుల సీజ్

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై మూడో రోజైన నేడు కూడా రవాణా శాఖ దాడులు కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్–ఆరంఘర్ చౌరస్తా దగ్గర ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారుల కొరడా ఝులిపించారు. చెన్నై, తిరువంతపురం, పాండిచ్చేరి, మంగళూరు, మైసూరు, కన్యాకుమారి నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులను తనిఖీలు చేస్తున్నారు. నిబంధనలకు తూట్లు పొడిచేలా చేస్తున్న10 ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఒక బస్సును సీజ్ చేశారు. ఇక, రంగారెడ్డి జిల్లా ఉప రవాణా శాఖ అధికారి సదానందం ఆదేశాల మేరకు ఉదయం నాలుగు గంటల నుంచి తనిఖీలు కొనసాగుతున్నాయి.


### పెద్ద అంబర్ పేటలోనూ

పెద్ద అంబర్ పేట్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారుల తనిఖీలు కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 10 బస్సులను సీజ్



చేశారు. ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో రవాణా శాఖ అధికారుల సోదాలతో పెద్ద అంబర్ పేట్ ఔటర్ రింగురోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. అలాగే, ఔటర్ రింగు రోడ్డుపై సైతం వందల వాహనాలు బారులు తీరాయి. టోలు ఫీజులు వసూలు చేస్తుండడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి.. దీని వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు...



శ్రీశైలం: శ్రీశైలం మల్లన్న ఆలయంలో నేటి నుండి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.. ఇవాళ్టి నుంచి ఈనెల 17 వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు..శ్రీస్వామివారి యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు.. ఇక, సాయంత్రం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం నిర్వహిస్తారు.. రేపటి నుండి శ్రీస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ వాహనసేవలు ఉంటాయి.. ఈ నేపథ్యంలో నేటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు రుద్ర, చండీ, మృత్యుంజయ హెూమాలు నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు ప్రకటించారు.. అంతేకాకుండా.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీస్వామి అమ్మవార్ల కళ్యాణం, ఏకాంత, ప్రదోషకాల, ప్రాతకాల,ఉదయస్తామాన సేవలు నిలుపుదల చేసినట్టు దేవస్థానం వెల్లడించింది..మరోవైపు.. శ్రీశైలం మల్లన్న ఆలయంలో పుష్యశుద్ధ ఏకాదశి సందర్భంగా అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పుష్పార్చన నిర్వహించారు.. పుష్పకైంకర్యమంలో సుమారు 40 రకాల పుష్పలు, బిల్వం, దవనం,మరువం వంటి పత్రాలతో శ్రీస్వామి అమ్మవార్లకు అర్చకస్వాములు విశేషంగా పూజాదికాలు జరిపించారు.ఈ పుష్పార్చనలో 4వేల కేజీల పుష్పాలు మొత్తం 40 రకాల పుష్పాలతో ఈ పుష్పార్చన జరుపగా పుష్పార్చనలో అర్చక, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించి సంకల్పంలో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజాదికాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా పుష్పార్చన జరిపారు. ఈ పుష్పార్చన సందర్భంగా వేదపారాయణలు జరిపేందుకు దేవస్థానం వేదపండితులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి మరో 15 మంది వేదపండితులతో పారాయణలను నిర్వహించగా పుష్పకైంకర్యానికి పుష్పాలంకృత వేదికను పుష్పాలన్నింటిని ఏపీ రాష్ట్ర బీసీ యువజన పార్టీ అధ్యక్షుడు పుంగనూరు రామచంద్ర యాదవ్ దేవస్థానానికి విరాళంగా అందజేశారు.

## సంపాదకీయం

ఆదివారం 12-01-2025

# గగ్గోలు పెడితే..అబద్ధాలు నిజాలు కావు !

తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో దబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడుఫార్ములా–ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా–ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా–ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగలేదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్ల మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్ఛనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్దమా..ధరణి అక్రమాలు అబద్దమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్దమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్దమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పువడుతున్నారు. ఇక్కడ గమనించాల్సిందేమంటే..అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమకేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా.. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో చర్చకు సిద్దం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కెటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ-కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. దొంకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వడం లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పు చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ గారు చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఎఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్ఎండిఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనేవితండవాదన కూడా కెటిఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరు అతీతం కాదని గుర్తించాలి.

# కాంగ్రెస్ ఫోబియా-కానరాని సైన్స్ కాంగ్రెస్

హైదరాబాద్,గతంలో జవహర్ లాల్ నెహ్రూ దగ్గర నుండి కాంగ్రెస్ పార్టీ 'హిందూ' ఫోబియాతో భారతీయ సామాజిక జీవనానికి చెప్పలేని విధ్వంసాలు సృష్టిస్తూ వచ్చింది. నాడు స్వాతంత్ర్య పోరాటంలో తిరుగులేని నాయకత్వం వహించిన కాంగ్రెస్ నేతల అవకాశవాద విధానాలను సవాల్ చేస్తూ ప్రజలలో ప్రాబల్యం పెంచుకుంటున్న హిందూ మహాసభపట్ల చెలరేగిన అభద్రతా భావమే అటువంటి ఫోబియాకు దారితీసిందని చెప్పవచ్చు. ఆ తర్వాత దేశవిభజన సమయంలో కాంగ్రెస్ నిస్తేజంగా మారడం, హిందువుల రక్షణ కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అగ్రగామిగా నిలబడడంతో ఆ సంస్థ పట్ల అభద్రతా భావం చెలరేగింది. ముందుగా సర్దార్ పటేల్ ద్వారా కాంగ్రెస్ అనుబంధ స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ ను చేరమని అధికారికంగా కాంగ్రెస్ ఆహ్వానించింది.అందుకు ఆ సంస్థ విముఖత వ్యక్తం చేయడంతో ఆ పటేల్ ద్వారానే గాంధీజీ హత్యను సాకుగా తీసుకొని ఆ సంస్థపై నిషేధం విధించింది. ఆ తర్వాత జనతా ప్రభుత్వంలోని సోషలిస్టులలో సైతం ఆర్ఎస్ఎస్‌పట్ల అభద్రతా భావం ఏర్పడింది. ముందుగా ఆర్ఎస్ఎస్ సైతం జనతా పార్టీలో అనుబంధ సంస్థగా విలీనం కావాలన్నారు. అందుకు ఒప్పుకోకపోవడంతో 'ద్వంద సభ్యత్వం' వివాదంతో నాటి జనతా ప్రభుత్వాన్నే కూల్చివేశారు. కాంగ్రెస్ మొత్తం మీద మూడు సార్లు ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించింది. కానీ సాధించింది ఏమీ లేదు. ఎమర్జెన్సీ సమయంలో స్వయంగా ఇందిరా గాంధీ నిషేధ సమయంలో ఆర్ఎస్ఎస్ ప్రతి మూలకు విస్తరించింది అంటూ చెప్పుకురావడం గమనార్హం. హిందూ అనే పదం హిందూ మహాసభ లేదా ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చింది కాదనే స్పృహ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ ఎంతో నష్టపోయి నేడు తన అస్తిత్వంకోసం పోరాడాల్సిన పరిస్థితి తెచ్చుకుంది. ఈ సంస్థలకన్నా ముందు చెన్నైలో 'ది హిందూ' అనే దినపత్రిక ప్రారంభమైంది.బెంగళూరులో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ అనే రక్షణ ఉత్పత్తుల సంస్థ ఏర్పడింది. పలు ప్రభుత్వ రంగ సంస్థలు 'హిందూ' పేరుతో వెలిశాయి. ఇప్పుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి సైతం 'నెహ్రూగాంధీ', 'కాంగ్రెస్' ఫోబియాతో సతమతమవుతున్నట్లు కనిపిస్తున్నది. స్వతంత్ర భారత దేశంలో భారత సైన్యం సాంకేతికంగా గెలుపొంది, విదేశీ సైనికులు లొంగుబాటు ప్రదర్శించిన యుద్ధం 1971 మాత్రమే. ఆ ఘనమైన విజయానికి చిహ్నంగా పాక్ సైనికులు మనసైనికుల ముందు లొంగిపోయిన చిత్రాన్ని భారత సైన్యం తన ప్రధాన కార్యాలయంలో గత 50 ఏళ్లుగా ఉంచుతూ వచ్చింది. విదేశీ సైనికాధికారులు ఎవ్వరు వచ్చినా ఈ చిత్రం ముందే మన సైన్యాధిపతులతో భేటీ జరపడం, ఫోటో దిగడం జరుగుతూ వస్తోంది. ఈ చిత్రంలో ఇందిరా గాంధీ లేరు. అయినా దానిని చూడగానే ఆమె సాహసం, వైట్ హౌస్‌కు వెళ్లి 'కొన్ని వేల కిలోమీటర్ల దూరం నుండి వర్ధమాన దేశాలపై ఆధిపత్యం వహించాలి అంటే కుదరదు' అని హెచ్చరించిన ఆమె ధైర్యం ప్రజలకు గుర్తుకు వస్తాయనే భయంతో ఆ ఫోటోను మార్చివేశారు. అగ్రరాజ్యాల ప్రాపకం కోసం అర్రులు చేస్తున్న నేటి పాలకులలో ఓ విధమైన వణుకు వచ్చినట్లుంది. తమ ఘనమైన పాలన ద్వారా ప్రజలకు ఎల్లప్పుడూ గుర్తుండే ప్రయత్నం చేయకుండా గత పాలకుల గుర్తులు చెరిపివేసే ప్రయత్నాలు గత పదేళ్లుగా పెద్ద ఎత్తున చేస్తూనే ఉన్నారు.తాజాగా గత రెండేళ్లుగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు జరగడంలేదు.జనవరి 3 అంటే దేశంలో ఎక్కడో ఒకచోట సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాన మంత్రిగా ఎవ్వరుంటే వారు ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. అదే విధంగా ముగింపు సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగిస్తారు. దేశంలోని కీలక శాస్త్రవేత్తలకు మాత్రమే కాకుండా, అంతర్జాతీయంగా కూడా సైన్స్‌రంగంలో గుర్తింపు పొందిన సమావేశాలు ఇవి. గత ఏడాది అయితే సమావేశాలను జరపడం లేదనే ప్రకటన చేశారు. ఈ సంవత్సరం అటువంటి ప్రకటన కూడా రాలేదు. 'కాంగ్రెస్' అంటే సమూహమని చెప్పొచ్చు. అమెరికాలో ఎన్నికైన ప్రజాప్రతినిధులతో ఏర్పడే సమూహాన్ని 'కాంగ్రెస్' అనే అంటారు. అయితే నేటి పాలకులకు కాంగ్రెస్ అనగానే అభద్రతాభావం పెల్లుబుకు వస్తున్నట్లు కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వాలను రాష్ట్రాల్లో కూల్చివేస్తూ వచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ పేరుతో ఉండే అన్ని రకాల సమావేశాలకు తిలోదకాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానం కలుగుతుంది. ఇటీవల కాలంలో సైన్స్ కాంగ్రెస్ నిర్వహణకు అంతరాయం కలుగుతుంది. సమావేశాల ప్రధాన అంశాన్ని నిర్ణయించే విషయంలో కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ, సాంకేతిక మంత్రిత్వ శాఖకు, సమావేశాలను నిర్వహించే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్‌లకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈసమావేశాలు




జరగడం లేదని తెలుస్తోంది.ఈ సమావేశాలకు ఆర్థిక వనరులను సమకూర్చే కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖ తాము సూచించిన అంశాలపైన చర్చించకపోతే నిధులు ఇవ్వమని స్పష్టం చేయడంతో సైన్స్ కాంగ్రెస్ నిర్వహించలేకపోతున్నట్లు తెలుస్తున్నది. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు కేవలం అధికారంలో ఉన్న నేతల ప్రచారానికి పనికివచ్చే అంశాలను సూచించడం, అందుకు శాస్త్రవేత్తలు అంగీకరించకపోవడంతో వివాదం ఏర్పడినట్లు భావించాల్సి వస్తుంది. 1914లో లక్నోలోని కానింగ్ కాలేజ్ ప్రొఫెసర్ పిఎస్ మాక్ మహన్, మద్రాసులోని రెసిడెన్సి కళాశాల ఆచార్యులు జెఎల్ సిమన్సేన్ సంయుక్తంగా చేసిన ఆలోచన తర్వాత కాలంలో ప్రతి ఏటా సైన్స్ కాంగ్రెస్ పేరున శాస్త్రవేత్తల సమ్మేళనం జరగడానికి కారణమైంది. తొలుత కొన్ని విభాగాలతోనే అది మొదలైనా క్రమంగా విస్తరించడం, దానికి తోడుగా స్వాతంత్ర్యోద్యమం కూడా కలవడం వల్ల అది మరింత బలపడింది.1930 నుంచి ప్రాధాన్యత మరింత స్పష్టంగా పెరుగుతూ వచ్చింది. మరీ ముఖ్యంగా 1937లో జవహర్ లాల్ నెహ్రూ ఈ సమావేశాల్లో పాల్గొని సైన్సు ప్రాధాన్యత ఏమిటో, సమాజ నిర్మాణంలో అది ఎటువంటి పాత్ర పోషించగలదో వివరించిన ప్రసంగానికి చాలా ప్రాధాన్యత ఉంది. 1947 దాకా బ్రిటిష్ వారి ఏలుబడిలో భారతీయ, ఐరోపా శాస్త్రవేత్తల కలయిక వేదికగా కొనసాగుతూ ఉండెడిది. కానీ తర్వాత కాలం లో ఈసమావేశాల్లో చేసిన ప్రతిపాదనల కారణంగానే పర్యావరణం సంబంధించి, సముద్ర వనరుల వినియోగం గురించి ప్రత్యేక దృష్టి సారించిన కారణంగానే తర్వాతి కాలంలో అవి ప్రత్యేక మంత్రిత్వ శాఖలుగా కూడా పరిణమించడం ఓ చరిత్ర. నాలుగు దశాబ్దాల క్రితం విశాఖపట్నంలో జరిగిన సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో ప్రతి ఏటా ఒక ప్రత్యేక లక్ష్యంతో జరగాలని నిర్ణయం తీసుకోవడంతో దానికి తగ్గట్టుగా జరుగుతున్నాయి.ఇంత ప్రాధాన్యత ఉన్నా విమర్శలు కూడా క్రమంగా పెరుగుతూ వచ్చాయి. గట్టి కృషి కన్నా వట్టి ప్రచార పటాటోపమే ఎక్కువ అని, ఇంకా ఇది ఒక సైన్స్ కుంభమేళా వంటి సమ్మేళనమని కూడా తరచూ వినపడింది.అవినీతి ఆరోపణలు కూడా బాగానే ఉన్నాయి. అంతర్గత సంస్కరణల గురించి పట్టించుకోవడం లేదు. సైన్స్ కాంగ్రెస్ -2017ను నిర్వహించాల్సిన తమిళనాడులోని యూనివర్శిటీలో జరిగిన ఆర్థికపరమైన అవకతవకల కారణంగా అర్ధాంతరంగా వేదికను తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి మార్చారు. కరోనా 2021, 2022 లలో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరగలేదు. గత ఏడాది నాగపూర్‌లో సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను ప్రధాని నరేంద్ర మోడీ వర్చ్యువల్‌గా ప్రారంభించారు. జనవరి 2024లో జరిగే సైన్స్ కాంగ్రెస్‌కు ప్రభుత్వం నుండి ఎటువంటి మద్దతు ఉండబోదని కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ గత సెప్టెంబర్‌లో స్పష్టం చేయడంతో తొలుత సైన్స్ కాంగ్రెస్ వేదికగా నిర్ణయమైనా లక్నో యూనివర్శిటీ వెనకడుగు వేసింది.ఆ తర్వాత ముందుకొచ్చిన లవ్లీ యూనివర్శిటీ సైతం కొద్ది రోజుల ముందే చేతులెత్తేయడంతో మరో వేదిక ఏర్పాటు చేసుకోవడం సాధ్యం కాలేదు. వీలైతే వచ్చే నేల జరిపేందుకు నిర్వహణకు ముందుకు వచ్చే సంస్థలకు విజ్ఞప్తి చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ సక్సేనా ప్రకటించారు. ఐదు రోజుల పాటు సైన్స్ కాంగ్రెస్ జరిపే సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ 5 కోట్లు ఇస్తుంది. సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి భారతీయ అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాలను జరుపుతుంది. తమ స్వతంత్ర నిర్వహణను కాపాడుకునేందుకు ప్రభుత్వ జోక్యాన్ని నిరసిస్తూ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ కోర్టు మెట్లు కూడా ఎక్కాల్సి వచ్చింది. ఏదిఏమైనా రాజకీయ వివాదాల సుడిగుండంలో ప్రతిష్ఠాకరమైన ఇండియా సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు అంతరించి పోనున్నాయా?

# పొగడ్తలతోనే సరి!



అమరావతి,నిన్న ప్రధాన మంత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం పూడిమడకలో ఎన్‌టిపిసి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వరంగ సంస్థ మూడు దశల్లో రూ. 65,370 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మొదటి దశలో 2,500 ఎకరాల భూమిలో రూ. 1,518 కోట్ల ప్రాజెక్టు అయిన కృష్ణపట్నం ఇండస్ట్రియల్ హబ్‌ను ప్రధానమంత్రి వర్చువల్‌గా ప్రారంభిచారు. ఇది 50,000 మందికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు. నక్కపల్లిలో రూ.1,877 కోట్లతో బల్క్‌డ్రగ్స్ పార్కును కూడా మోడీ శంకుస్థాపన చేయనున్నారు. రూ. 11,542 కోట్ల పెట్టుబడితో 2,002 ఎకరాల్లో బల్క్ డ్రగ్స్ పార్క్ 54,000 మందికి ఉపాధిని కల్పిస్తుందని అంచనా. దేశప్రధాని రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ వచ్చి వెళ్లారు. భారీ బహిరంగ సభలో మాట్లాడారు.ఆయన ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ ప్రాంతం, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గత నాలుగేళ్లుగా పోరాడుతున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మాట మాత్రం కనీసంగా కూడా ఎత్తలేదు. పక్కనే ఉన్న సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కనీసంగా కూడా అడగలేదు సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీపడ్డారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారు. సభఅంతా ఒకరినొకరు పొగుడుకోవడంతోనే సరిపోయింది. ప్రధాని సభలో పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు నిర్మాణం, ఆయన విధానపరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ప్రభుత్వరంగ ప్రాధాన్యత తెలుస్తోంది. మరోవైపు కడపలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించుకుపోవాలని ప్రభుత్వ పెద్దలు కృత నిశ్చయంతో ఉన్నారు. సంప్రదాయాన్ని, మార్గదర్శకాల్ని పక్కకుతోసి తమ పంతం నెగ్గించుకోవాలని చూస్తున్నారు. పాలకులు, పాలక పార్టీలు ఏవైనాసరే దశాబ్దాల తరబడి రాయలసీమ నిర్లక్ష్యానికి గురవుతుందనడానికి తిరుగులేని సత్యమిది. మళ్ళీమళ్ళీ పునరావృతం అవుతున్న విషాదమిది.ఇప్పటికే కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లో భాగమైన ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్ అమరావతికి తీసుకుపోయారు. తాజాగా, రాయలసీమ నుంచి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎపిఇఆర్‌సి, వక్ఫ్ ట్రిబ్యునల్, సిబిఐకోర్టు అమరావతికి తరలిస్తున్నారన్న వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం అంటే రాయలసీమ ప్రజలంటే పాలకులకు లెక్కలేనితనమే కారణం. గ్రామీణ బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్ణయించబడే ప్రధాన కార్యాలయం వెనకబడిన జిల్లాలకే అవసరం ఎక్కువ. అంతేకాక ప్రధాన కార్యాలయం ప్రత్యక్ష పరోక్ష ఉపాధి అవకాశాలకు కూడా వీలు కల్పిస్తుంది. పేద, మధ్యతరగతి, చిన్న, సన్నకారు రైతులకు, చిన్నచిన్న వ్యాపారులకు, డ్వాక్రా సంఘాలు, చేతివృత్తులు, చిన్నపరిశ్రమలు, స్వయం ఉపాధి సంఘాలకు, ఎదిగొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు -ఇలా అనేక రకాల వారికి రుణాలను ఇచ్చే బ్యాంకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్.రాయలసీమకు జరిగిన అనేక అన్యాయాల కొనసాగింపుగానే అన్ని సంస్థల తరలింపు జరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ వృద్ధి నమూనాలు వేతనాలలో సర్దుబాట్లు లేదా మూలధనానికి రాబడికి సంబంధించిన అంచనాలకు అనుగుణంగా లేవు. ఇది చివరికి ప్రాంతీయ ఆర్థిక కలయికకు దారితీస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమతుల్యతలను తగ్గించడంలో ఏరకమైన జోక్యం సహాయపడుతుందనేది ప్రశ్నగా మిగిలిపోయింది. కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నం పోర్టు సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు రావలసిన ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వం ఒక ప్రహసనంలా మార్చేసింది. వీటిపై కూడా కూటమి నేతలు నోరు మెదపడం లేదు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రానికి ఏదో న్యాయం జరుగుతుందని కొంతమందికైనా వున్న భ్రమలు ఇప్పుడు క్రమేణా కరిగిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు, ఇతర బాదుళ్లతో సామాన్యుల నడ్డి విరుస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడు కోవాలన్నా, విభజన చట్టం అమలు కావాలన్నా, ఎడాపెడా వేస్తున్న భారాలను తిప్పికొట్టాలన్నా, చట్టపర హక్కులను నిలబెట్టుకోవాలన్నా ప్రజా పోరాటమే శరణ్యం.

# వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సిందే

నల్లగొండ,సంక్రాంతి పండగ సమయంలో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాలు ఒకదాని వెనుక ఒకటి వరుస కడతాయి. ప్రస్తుతం దారి పొడవునా మరమ్మతు పనులు నడుస్తున్నాయి. ఎల్బీనగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు ఆరు వరుసల విస్తరణ పనులు.. దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు బ్లాక్‌స్పాట్స్‌లో అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. డ్రైవింగ్‌లో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు సంభవించడంతోపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. చాలాచోట్ల పనులు జరుగుతున్నందున వాహనాలను అప్రమత్తంగా నడపాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు. ఇనామ్‌గూడ వద్ద అండర్‌పాస్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పండక్కి వెళ్లే వాహనాలతో ఇక్కడ ట్రాఫిక్‌జామ్ అయ్యే అవకాశముందని, వంతెన మీద మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ బస్టాప్‌ల వద్ద విస్తరణ చేపట్టకపోవడంతో ఆయాచోట్ల ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తే అవకాశముంది. మరోవైపు దండుమల్కాపురం నుంచి నందిగామ మధ్య తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో మరమ్మతు పనులు నడుస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో వాహనదారులు నిదానంగా వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. ఈ పనులు జరిగే చౌటుప్పల్, చిట్యాల తదితర ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. నిరుడు సంక్రాంతికి చౌటుప్పల్‌లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. గుత్తేదారుతో మాట్లాడి సర్వీసు రోడ్డులో రాకపోకలకు ఆటంకం లేకుండా చూస్తామన్నారు.

# నెక్నాంపూర్ చెరువులో ఆక్రమణల కూల్చివేత

హైదరాబాద్,నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేసింది. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా. దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది. నెక్నాంపూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు వెలిశాయి. గతంలో టౌన్ ఎ÷–లానింగ్ అధికారులు, రెవన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణాలు వెలిశాయి. మూడు సార్లు కూల్చివేతలు జరిగినప్పటికీ స్థానిక అధికారులను మేనేజ్ చేసుకుని అక్రమ నిర్మాణాలను చేస్తున్నారంటూ స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ విల్లాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం హైడ్రా కమిషన్ రంగనాథ్ అక్కడకు చేరుకుని నెక్నాంపూర్ చెరువుకు సంబంధించిన లేఅవుట్‌లను పరిశీలించారు. ఎంత మేరకు అక్రమాలు జరిగాయనేదానిపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత.. స్థానిక అధికారులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. ఇటీవల కాలంలో హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తోంది. నగర శివారులో ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లపై హైడ్రా ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ శివారు నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిపై యాక్షన్ తీసుకోవాలని ఇప్పటికే హైడ్రా అధికారులకు హైడ్రా చీఫ్ కీలక ఆదేశాలు చేశారు. అందులో భాగంగానే మణికొండ నెక్నాంపూర్ చెరువులో వెలసిన అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది.

# సేవలు నిలిపివేత...

హైదరాబాద్: మాది ప్రజా పాలన అంటూ ప్రగల్భాలు పలుకుతున్న రేవంత్ సర్కార్.. ఈ రాష్ట్రంలోని పేదలు, ఉద్యోగులు, జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ సాయం రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు కాంగ్రెస్ సర్కార్ ప్రకటనలు చేసింది తప్ప.. ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. ఒక్క ఆరోగ్య శ్రీనే కాదు.. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ఎంప్లాయి హెల్త్ స్కీం, జర్నలిస్టులకు సంబంధించిన జర్నలిస్ట్ హెల్త్ స్కీం పథకాలు అటకెక్కాయి. ఈ మూడింటికి సంబంధించిన పెండింగ్ బకాయిలను రేవంత్ సర్కార్ చెల్లించకపోవడంతో.. ఈ సేవలను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ప్రకటించారు. ఈ నిలిపివేత త క్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 1200 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అసోసియేన్ ప్రెసిడెంట్ డాటర్ వీ రాకేశ్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ కింద రోగులకు సేవలు అందించడం.. చెల్లింపుల చెల్లింపులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఆయా జిల్లాల్లోని ఆస్పత్రులన్నీ ఈ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం.. పెండింగ్ బకాయిలను చెల్లించడం, ఆరోగ్య శ్రీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోవడం ఇబ్బందిగా మారింది.ఆరోగ్య శ్రీ,ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ స్కీంల కింద అందించే వైద్య సేవలకు గానూ నెలకు దాదాపు రూ. 100 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. సంవత్సరానికి అయితే రూ. 1200 నుంచి రూ. 1300 కోట్ల బిల్లులు చెల్లించాలి. ఏడాదికి సంబంధించిన రూ. 1200 కోట్ల బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తున్న కారణంగానే ఆరోగ్య శ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ సేవలను నిలిపివేయాల్సి వచ్చింద ని డాక్టర్ రాకేశ్ పేర్కొన్నారు.ఆరోగ్య శ్రీ సీఈవో శివశంకర్, నెట్ వర్క్ ఆస్పత్రుల మధ్య గురువారం జరిగిన సమావేశంలో నెల రోజులకు సంబంధించిన వైద్య బిల్లులను కవర్ చేసే రూ. 100 కోట్ల టోకెన్‌ను ప్రభుత్వం అందించింది. ఈ టోకెన్ అమౌంట్‌ను అసోసియేషన్ సభ్యులు తిరస్కరించారు.

# తిరుపతి ఘటన చాలా బాధించింది

నెల్లూరు,రాష్ట్ర ప్రజలందరికీ ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముక్కోటి ఏకాదశి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో పండుగ ఘనంగా జరుగుతోందన్నారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన చాలా బాధకరమన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధని వ్యక్తం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు రూ.2లక్షల కోట్లకుపైగా నిధులు సాధించి, అభివృద్ధిని ఆరంభించారని.. కానీ అందరూ ఆనందంగా ఉన్న సమయంలో ఇలాంటి ఘటన బాధాకరమన్నారు. విషయం తెలిసిన వెంటనే తనతో పాటు సహచర మంత్రులందరం కలిసి తిరుపతి చేరుకుని మృతుల కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూశామన్నారు. మృతుల్లో నలుగురు ఏపీ, ఒకరు తమిళనాడు, మరొకరు కేరళాకు చెందినవారు ఉన్నారని తెలిపారు. అలాగే గాయపడిన 35 మంది స్విమ్స్‌కు తరలించి చికిత్స అందజేశారని తెలిపారు. ఓ మహిళ అస్వస్థతకు గురికావడంతో ఆవిడను తీసుకొచ్చే క్రమంలో ఒక గేటును తెరవబోయి.. మరోగేటును తెరవడంతో భక్తులు ఒకేసారి దూసుకురావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు క్షతగాత్రులు చెప్పారన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో డీఎస్పీ స్థాయి అధికారి అక్కడ లేరని అన్నారు. వైకుంఠ ద్వార టోకెన్ల కోసం తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లను ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ జరగలేదన్నారు. గత ప్రభుత్వ ఆనవాయితీలను ఎందుకు అనుసరించారని సీఎం చంద్రబాబు కూడా సీరియస్ అయ్యారని తెలిపారు. గాయపడిన వారిని సీఎం పరామర్శించారని.. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారన్నారు. అలాగే... మృతుల కుటంబాలకు రూ.25 లక్షల చెప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారన్నారు. గాయాలైన వారు స్వామి దర్శనం చేసుకుని వెళతామని చెప్పడం సీఎంను కదిలించిందని.. అందుకే వారిని.. వారితో పాటు వచ్చిన వారందరికీ స్వామి దర్శన ఏర్పాట్లు చేయమని ఆదేశించారన్నారు. ఘటన పట్ల అందరూ చింతిస్తూ.. అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని.. సలహాలు ఇవ్వాలని కోరామన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీ హోదా లేని మాజీ సీఎం జగన్ పరామర్శకు వచ్చినప్పుడు ఆసుపత్రిలో అహంకార దర్పాణ్ని ప్రదర్శించారని మండిపడ్డారు. నేతలు, కార్యకర్తలను వందల సంఖ్యలో వెంట పెట్టుకుని లోనికి వెళ్లారన్నారు. డాక్టర్లు వారిస్తున్నా వినలేదని.. ఐసీయూ నిబంధనలు ఏమిటో జగన్‌కు తెలియదా అని మంత్రి ప్రశ్నించారు. సీఎం కంటే అధికంగా జగన్‌కు భద్రత ఏర్పాటు చేశారని... నేతలు, కార్యకర్తలు.. డాక్టర్లు, సిబ్బందిని నెట్టుకుంటూ వెళ్లారని... పేషెంట్లకు పెట్టిన సెలైన్లు, స్టాండ్లు తోసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "జగన్ వచ్చిన సమయంలో 18 మంది ఉన్నారు. జగన్‌కు దుష్టచతుష్టయం టీం ఉంది. ఆ నలుగురే టీటీడీని భ్రష్టుపట్టించారు. వారిలో ఒకరు 18 మందికి కవర్లు ఇచ్చి... ప్రభుత్వం, టీడీపీ, సీఎంపై విమర్శలు చేయమన్నారు. సీసీ కెమెరాల్లో తెల్లకవర్లు ఇచ్చిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఏమి సంస్కృతి మీది?... మృగాల మధ్య బతకాల్సిన వారు జనంలో తిరుగుతున్నారు. శవాల మీద పేలాలు ఏరుకోవడానికి తయారయ్యారు. సమాజానికి దూరంగా ఉండమని ప్రజలు బుద్ధి చెప్పినా... ఇంకా బుద్ధి రాలేదు" అంటూ మంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. వైసీపీ నేతలకు సనాతన ధర్మం తెలియదని... ఆగమ శాస్త్ర నిబంధనలని పాటించిన పాపన పోలేదన్నారు. వేదపండితులను మరిచిపోయారని... నిగమ, అగమ సంప్రదాయాలు మరిచిపోయారని.. మేకవన్నె పులులు మాదిరిగా తయారయ్యారని వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాదాయశాఖ అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఆధ్యాత్మక చింతనే పరమావధిగా, అన్ని ఆలయాల్లో పూజాధి కార్యక్రమాలతో సహా అన్నీ పండితుల నిర్ణయం ప్రకారమే జరగాలని ఆదేశించిందన్నారు. మైకు సెట్లలో భగవంతుడి నామస్మరణ జరిగేలా చూస్తున్నామన్నారు. నవరాత్రి ఉత్సవాలన్ని అత్యంత వైభవంగా జరిపామని.. కనకదుర్గాదేవి ఆలయంలో మూలా నక్షత్రం రోజున సీఎం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారన్నారు. భక్తులందరికీ మినరల్ వాటర్, ఆహారం అందించామని.. భక్తులందరికీ దర్శనం అందేలా చూశామని తెలిపారు. కన్యకాపరమేశ్వరికి ప్రభుత్వమే చీరాసారెలు అందించాలని ఆదేశిలిచ్చామన్నారు. ఆదాయం తక్కువ ఉండే 50 వేల ఆలయాలకు దూపదీప నైవేద్యాల కోసం నెలకు రూ.10 వేలు ఇస్తున్నామని... 6 వేల మంది యువ వేదపండితులకు రూ.3వేలు చొప్పున ఇస్తున్నామన్నారు. ఆలయాల్లో త్వరలోనే వేదపండితులను నియమిస్తామని వెల్లడించారు. ఆలయ కమిటీల్లో బ్రాహ్మణ, నాయిబ్రాహ్మణలకు ఖచ్చితంగా అవకాశమివ్వాలని ఆదేశించామన్నారు. ప్రభుత్వ ఆలయాల్లో అర్చకుల గౌరవ వేతనం రూ.10 వేలు నుంచి రూ.15 వేలుకు పెంచామని.. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రత పెంచామన్నారు. తిరుపతి ఘటనపై విచారణ వేగవంతంగా సాగుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుడు నరం లేని నాలుక తీరున మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. "నెయ్యి గురించి మాట్లాడుతున్నారు.. ప్రసాదాలని భ్రష్టుపట్టించిందే జగన్. మేము నెయ్యి వ్యవహారాన్ని బయటపెట్టాం. ప్రసాదాలు, అన్నప్రసాదాలు బాగున్నాయని భక్తులు స్వయానా సీఎంకి చెప్పడం సహించలేకున్నారు. దుష్టచతుష్టయంలో ఒక్కొక్కరికీ ఒక్కో చరిత్ర ఉంది. మా ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి మీకెప్పుడూ రాదు, రానివ్వం కూడా" అని మంత్రి ఆనంరామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

# మారనున్న ముఖచిత్రం

హైదరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంబీజీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస-శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్ విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది.

# సంక్రాంతి బాదుడు!



హైదరాబాద్,సంక్రాంతి సీజన్ అంటే.. అందరికీ పండుగే. జనాలను దోచుకోడానికి అనుకూలించే పర్ఫెక్ట్ సీజన్ ఇది. పండక్కి జనం ఇంటికెళ్లి కుటుంబాలతో పాటు ఎంజాయ్ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇందుకోసం ప్రజలు ఎలాగైనా గమ్యం చేరుకునే ప్రయత్నాలు చేస్తారు. బస్సుల్లోనో.. రైళ్లలోనో.. ఫ్లైట్స్ బుక్ చేసుకునో.. క్యాబ్‌లు మాట్లాడుకోనో.. వెళ్తుంటారు. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనదారులు, ట్రావెల్ ఏజెన్సీలు పండుగ బాదుడుకి తెరతీశాయి. టికెట్ రేట్లు భారీగా పెంచేశాయి. సాధారంగా వెయ్యి రూపాయలు ఉండే టికెట్ ధర రెండింతలు పెరిగింది.

దంచిపడేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్..

హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే వెయ్యి లోపే ఖర్చయ్యే చోట 1500 నుంచి 2500 వరకు పెట్టాల్సి వస్తోంది. సంక్రాంతి పండగంతా గోదావరి జిల్లాల్లోనే కనిపిస్తుంది. అక్కడకు స్థానికులే కాదు.. తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి చాలమంది తరలివస్తుంటారు. దీంతో రాజమండ్రి టికెట్ హైదరాబాద్ నుంచి 1500ని మించదు కాని.. ఈసారి స్లీపర్ 4వేల రూపాయలుగా పెట్టేశారు. ఈ దోపిడీ ఏంటని ప్రయాణికులు తల పట్టుకుంటున్నారు. నాన్ ఏసీ అయితే 2వేలు ఉంది. వైజాగ్‌కు ఆర్టీసీ బస్సులో 2వేల రూపాయల లోపే టికెట్ ఉంటే.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు 3వేల నుంచి 5500 వరకు వసూలు చేస్తున్నాయి. స్లీపర్ అయితే 6 వేల రూపాయల దాకా చార్జ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

రైళ్ల ధరలు అందుబాటులో ఉన్నా..

రైళ్లలో వెళ్లడానికి చార్జీ ధరలు అందుబాటులోఉన్నా.. రద్దీ మామూలగా లేదు. రెండు మూడు రాష్ట్రాల్లో పండుగ ఉండడంతో రైళ్లు రద్దీగా ఉన్నాయి. అంతేకాదు లేటుగా నడుస్తుండడం కూడా ప్రయాణికులపై ఎఫెక్ట్ పడుతోంది. ఈ సంక్రాంతికి అదనంగా 162 ప్రత్యేక రైళ్లను వివిధ మార్గాలలో నడుపుతన్నా రిజర్వేషన్‌లో సీటు దొరకడం లేదు.

ఆకాశంలో విమానం ధరలు

గత్యంతరం లేని స్థితిలో చాలామంది ప్రయాణికులు ఫ్లైట్లను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గన్నవరం, రాజమండ్రి, వైజాగ్‌కు వెళ్లేందుకు ఎగబడుతుండడంతో ఇదే అదనుగా పలు విమానయాన కంపెనీలు చార్జీలను పెంచేశాయి. రాజమండ్రి వెళ్లాలంటే 12 వేల నుంచి 15వేల వరకు టికెట్ ధర కనిపిస్తోంది. వైజాగ్ టికెట్ కొనాలంటే 15వేలకు తగ్గడంలేదు. దీంతో జనం పండుగ చేసుకునేందుకు దాచుకున్న సొమ్మంతా ట్రావెల్స్ కంపెనీలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఇక.. క్యాబ్‌లో వెళదామన్నా పండుగ రష్‌తో 24 గంటల ప్రయాణానికి ?30 వేలు చెల్లించాల్సిందే అంటున్నారు.

టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బాదుడు..

పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు ఆరు వేల అదనపు బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు తెలంగాణ ఆర్టీసీ తెలిపింది. అయితే.. ఈ పండుగ సీజన్?ను పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకునేందుకు ఆర్టీసీ రెడీ అయినట్టు తెలుస్తోంది. శుక్రవారం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సు టికెట్ ధరలను అమాతంగా ఒకటిన్నర శాతం పెంచేసింది. దీంతో ఇంటికెళ్లే దారేది అన్నట్లు జనం తల పట్టుకుంటున్నారు.

ఊరటనిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ..

పండుగ సీజన్‌లో ఏపీఎస్ ఆర్జీసీ వివిధ మార్గాల్లో ఏడు వేల బస్సు సర్వీసులను రంగంలోకి దించింది.. ప్రతి బస్సుకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. సాధారణ ధరలతోనే బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. అంతేకాకుండా ఒకేసారి రెండు వైపుల రిజర్వేషన్ చేసుకుంటే పది శాతం రాయితీ కూడా కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో ఆ బస్సుల్లో జర్నీ చేసేందుకు జనం పరుగులు తీస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్?కు అనుగుణంగా అవసరమైతే మరిన్ని బస్సు సర్వీసులను అందుబాటులోకి తెస్తామని ఆ సంస్థ ఎండీ తెలిపారు.

# టిటిడి నిర్లక్ష్యానికి పరాకాష్ట !




తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టిటిడి నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు..వేలమంది పోలీసులు.. ఇంతమంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమిక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిప్పటెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు. తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిప్పటెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డరు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఇక్కడ భక్తులను అదుపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కానీ, తగిన పోలీసు సిబ్బంది కానీ లేదని అర్థం అవుతోం. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేకుండా టిటిడి అధికారులు వ్యవహరించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇకపోతే సాధారణ రోజుల్లో కూడా తిరుమలలో కంపార్టుమెంట్లలో కూచోబెట్టడం, ఒక్కసారిగా వదలడం, తోపులాట జరిగేలా చేస్తున్నారు. తిన్నగా భక్తులు స్వామిని దర్శించుకునే పరిస్థితి లేదు. తిరుమల విధానాల్లో సంస్కరణలు రావాలి. నేరుగా వచ్చే భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండాలి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ విధానం బలపడాలి. శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులను కూడా క్యూలో తోసేస్తున్నారు. వారు టిక్కుట్లు పొందాక సరైన వసతి కల్పించడం లేదు. వసతి కోసంమరోచోటికి పరుగెత్తాలి. అక్కడ రాజముద్ర వేసుకున్నాక మరోచోటికి పరుగెత్తాలి. ఇలాంటి గందరగోళం లేకుండా సింగిల్ విండో విధానంలో దర్శనం, వసతి టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే తాజా దుర్ఘటన నేపథ్యంలో తిరుమలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

# ఎమ్మెల్యే ఇంట్లో సోదాలకు వెళ్లిన అధికారులకు షాక్

భోపాల్,మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే హరివంశ్ సింగ్ రాథోడ్ ఇంట్లో ఆదాయపన్ను శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అయితే సోదాలకు వెళ్లిన ఐటీ అధికారులకు షాక్ తగిగిలింది. బంగారం, కోట్ల నగదు, బినామీ కార్లతో పాటు ఆ ఇంట్లో మూడు మొసళ్లను కూడా గుర్తించారు అధికారులు. మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌తో పాటు మాజీ కౌన్సిలర్ రాజేశ్ కేశర్వాని నివాసాల్లో గత ఆదివారం నుంచి ఐటీశాఖ సోదాలు జరుగుతున్నాయి. సుమారు 155 కోట్ల పన్ను ఎగవేసినట్లు తెలుస్తోంది. ఆ మాజీ ఎమ్మెల్యే ఇంటి నుంచి మూడు కోట్ల నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను సీజ్ చేశారు. వాటి విలువ కోట్లల్లో ఉంటుందని భావిస్తున్నారు. రాథోడ్, కేశర్వాని .. ఇద్దరూ బీడీ వ్యాపారం చేసేవారు. అయితే కేశర్వాని సుమారు 140 కోట్ల పన్ను ఎగవేసినట్లు తెలిసింది. దానికి సంబంధించిన డాక్యుమెంట్లను రెయిడ్ సమయంలో గుర్తించారు. అతను నిర్మాణ రంగ వ్యాపారంలో కూడా ఉన్నాడు. అయితే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంటికి వెళ్లిన ఐటీశాఖ అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన ఇంట్లో మూడు మొసళ్లను గుర్తించారు. ఇంట్లో ఉన్న ఓ చిన్నపాటి కుంటలో వాటిని గుర్తించారు. దీంతో వాళ్లు అటవీ శాఖను అలర్ట్ చేశారు. కేశర్వాని ఇంట్లోనూ పలు బినామీ దిగుమతి కార్లను గుర్తించారు. ఒక్క కారు కూడా కేశర్వాని కుటుంబం పేరిట రిజిస్టర్ కాలేదు. ట్రాన్స్‌పోర్టు శాఖ నుంచి కార్లకు చెందిన సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆ కార్లను ఎలా కొన్నారన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. సాగర్ జిల్లాలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ తొలుత వ్యాపారం చేసేవాడు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జిల్లా చీఫ్ పోస్టు కోసం కూడా ఆయన పోటీపడ్డారు. ఆయన తండ్రి హర్నమ్ సింగ్ రాథోడ్ ..గతంలో మధ్యప్రదేశ్ మంత్రిగా చేశారు.

# రియల్‌ఎస్టేట్ రంగం అభివృద్ధికి కృషి : రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

విజయవాడ,రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం విజయవాడలో క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామమోహన్, బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులను సులభతరం చేస్తూ జీవోలు జారీ చేశామని చెప్పారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సరళమైన నిబంధనలు రూపొందించామని తెలిపారు. లే అవుట్‌లలో రోడ్లను 12 మీటర్ల నుంచి 9 మీటర్లకు తగ్గించామన్నారు.15 మీటర్లలోపు భవనాలు నిర్మాణాలకు ఎలాంటి అనుమతి లేకుండా లైసెన్సెడ్ సర్వేయర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నామని, ప్రాపర్టీ షోలో నిర్వహణ ద్వారా కొనుగోలుదారులకు అవగాహన వస్తుందన్నారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో సమావేశం అవుతానని, ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కాగా భవన నిర్మాణాలు, లేఅవుట్ల అనుమతులకు సంబంధించి నిబంధనలను సులభతరం చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ -2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ - 2017లో సవరణలు చేస్తూ వేర్వేరుగా ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకువచ్చామని అన్నారు. ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి నారాయణ తెలిపారు. సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ జీవోలు జారీ చేశామని అన్నారు. లే అవుట్లలో రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశామని చెప్పారు. 500 చ.మీ. పైబడిన స్థలాలు, నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లు తొలగిస్తూ జీవో జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీ.సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధన తొలగించినట్లు చెప్పారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సులభం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. రియల్ ఎస్టేట్ అసోసియేషన్‌ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్లు వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకోనుందని మంత్రి నారాయణ ప్రకటించారు.

# వ్యూహాన్నే అమలు చేస్తున్నారా?

హైదరాబాద్,పాత కాలం నాటి చిట్టి కథ ఒకటుంది. ఒక కుక్కను చంపాలంటే.. మొదట దాన్ని పిచ్చి కుక్క అని ముద్ర వేయాలి. అది నిజమని నమ్మించాలి. ఆ తర్వాత దాన్ని మనం చంపక్కర్లేదు. అందరూ కలిసి చంపేస్తారు. ఇప్పటి రాజకీయాలు కూడా అలానే ఉన్నాయి. రాజకీయ శత్రుత్వం ఎంత ఉన్నప్పటికి ప్రత్యక్షంగా చర్యలు తీసుకుంటే మొదటికే మోసం వస్తుంది. అదే.. కాస్త వెయిట్ చేసి.. సరైన అంశాన్ని టేకప్ చేస్తే.. రాజకీయంగానే కాదు వ్యక్తిగతంగానూ ఎన్ని తిప్పలు పెట్టాలో అన్ని తిప్పలు పెట్టొచ్చు. అంత చేసినప్పటికి ప్రజల నుంచి వ్యతిరేకత కూడా రాదు.గులాబీ బాస్ కేసీఆర్ ను ఇరుకున పడేసేందుకు.. ఆయన మనో స్థైర్యాన్ని దెబ్బ తీయటానికి.. ఆయన కుమార్తె కవిత చేసిన తప్పుతో సాధ్యమైందని చెబుతారు. కవితను లక్ష్యంగా చేసుకోవటం ద్వారా కేసీఆర్ కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చినట్లుగా వ్యాఖ్యానిస్తుంటారు. కవిత మీద ఆరోపణలు చేసినట్లుగా ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆమె పాత్ర నిజంగానే ఉందా? లేదా? అన్నది న్యాయ వ్యవస్థ తేల్చటానికి మరో పదేళ్లు పట్టొచ్చు.కానీ.. ఇప్పటికైతే జరగాల్సిన డ్యామేజ్ జరిగి పోయింది. అన్నింటికి మించి తెలంగాణ బాపు గారాలపట్టిని జైల్లో వేసినప్పటికి.. తెలంగాణ సమాజంలో ఈ అంశం ఎలాంటి భావోద్వేగాన్ని రగలకపోవటమే కేసీఆర్ కు ఎదురైన అతి పెద్ద ఎదురుదెబ్బగా అభివర్ణిస్తారు.నిజానికి కవిత అరెస్టు ఎపిసోడ్ ను చూస్తే.. ఒక క్రమపద్ధతిని ఫాలో కావటం కనిపిస్తుంది. వాయిదాల పద్ధతి మాదిరి..కవిత మీద కేసును బిల్డ్ చేయటం..ఆమె తప్పు చేసిందేమో అన్న సందేహానికి గురయ్యేలా చేయటం.. ఏదో జరిగి ఉండకపోతే ఇంత వరకు విషయం ఎందుకు వస్తుందన్న భావన కలిగించటం.. చివరకు కవిత అరెస్టు వేళకు.. ప్రజల్లోనూ ఎలాంటి సానుభూతి లేకుండా చేసిన వైనం అందరిని ఆకర్షించింది.తాజాగా మాజీ మంత్రి కేటీఆర్ ఇష్యూలోనూ కవిత విషయంలో అనుసరించిన పద్ధతినే ఫాలో అవుతున్నారా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఫార్ములా ఈ రేస్ లో సమ్ థింగ్.. సమ్ థింగ్ జరిగిందన్న భావన ప్రజల్లో అంతకంతకు ఎక్కువ అవుతోంది. కేటీఆర్ అరెస్టు అన్నంతనే.. ఉలిక్కిపడే స్థాయి నుంచి.. ఆయన రేపో మాపో అరెస్టు అవుతారన్న విషయాన్ని అందరూ అర్థం చేసుకునేలా పరిస్థితులు చోటు చేసుకోవటం.. ఆయనపై వచ్చిన ఆరోపణలు..దానికి ఖండనలు.. ఆ తర్వాత వాటికి కౌంటర్లు ఇలా సాగిపోయి.. మొత్తంగా ఫార్ములా ఈ రేసింగ్ లో ఏదో జరిగిందన్న విషయాన్ని ప్రజలు నమ్మే వరకు ఇప్పుడు విషయం వెళ్లింది.ఇలాంటి వాతావరణంలో కేటీఆర్ అరెస్టు జరిగినా.. ఇదేదో రాజకీయ ప్రతీకారంగా ప్రజలు భావించరు. అదే సమయంలో తాను ఎలాంటి తప్పులు చేయలేదన్న విషయాన్నిచెప్పుకునే క్రమంలో కేటీఆర్ ప్రదర్శించిన దూకుడు ఆయనకు నష్టం చేసేలా మారిందని చెప్పాలి. ఎందుకంటే.. తనపై పడిన మచ్చను కడుక్కునేందుకు కేటీఆర్ అనుసరించిన విధానం సరిగా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తనపై చేస్తున్న ఆరోపణలకు అందరూ నమ్మే సాక్ష్యాల్ని.. ఆధారాల్ని చూపే కన్నా నోటికి పని చెప్పిన కేటీఆర్ తీరు ఆయనకు నష్టం వాటిల్లేలా చేసిందంటున్నారు.ఒకవేళ కేటీఆర్ అరెస్టు కానీ జరిగితే.. గులాబీ పార్టీ అనుకుంటున్నట్లుగా ప్రజల్లో సానుభూతి భారీగా వస్తుందన్నఅంచనాల్లో ఏ మాత్రం నిజం లేదంటున్నారు. ఇప్పటివరకు చోటు చేసుకున్న అన్ని పరిణామాలు కవిత లిక్కర్ స్కాం వేళలో ఎలా జరిగాయో.. ఇప్పుడు అలానే జరుగుతు న్నాయంటున్నారు. మరి.. ఈ వాదనలో నిజం ఎంతో కాలమే డిసైడ్ చేయాలి.

## వరంగల్‌లో జర్నలిస్టు అరెస్టు

వరంగల్, తెలంగాణలో కేసుల పరంపర కూడా కొనసాగుతూనే ఉంది. తాజాగా ఓ జర్నలిస్టును పోలీసులు అరెస్టు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీడియోలు చేస్తున్నారని జర్నలిస్టును అక్రమంగా అరెస్టు చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లాలో వెలుగు చూసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీడియోలు చేస్తున్నారని సోషల్ మీడియాలో పోస్ట్ పెడుతున్నారని గురువారం రాత్రి 11 గంటల సమయంలో జర్నలిస్ట్ రాజ్ కుమార్‌ని వర్ధన్నపేట ఏఎస్‌ఐ రాజు పోలీస్ స్టేషన్‌కి పిలిపించారు.

# లొట్టపీసు కేసులో కెటిఆర్ అరెస్ట్ అయితే..?



హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పార్టీ అన్నది జగమెరిగిన సత్యం. పార్టీ అంతా కెసిఆర్, కెటిఆర్, కవితల ఆధ్వర్యంలో నడుస్తుంది. పైకి హరీష్ రావు కనిపిస్తున్నా..ఆయనది నిమిత్తమైన పాత్ర. ఆయన గగ్గోలు బ్యాచ్‌లో ఉంటారు. అందుకే కేటీఆర్‌పై కేసు నమోదు కాగానే అడ్డదిడ్డమైన వాదనలు, అరుపులతో గగ్గోలు పెట్టాలని చూశారు. మొత్తంగా గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా పనిచేసి వారంతా వచ్చి తమ సానుభూతి ప్రకటించి, దారాన్ని తాడులా పేనినట్లుగా ఒక్కటి కావాలనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో భూకంపం వచ్చిందన్న భ్రమలు కలగించే పరిస్థితి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. ఒకవేళ కెటిఆర్ అరెస్ట్ అయితే పార్టీని ఎవరు నడిపిస్తారన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే నేరుగా హరీష్ రావు చేతిలో పగ్గాలు పెట్టడం ఆ ఇంటి పెద్దలకు ఇష్ట లేదు. కెటిఆర్ పరోక్షంలో బీఆర్ఎస్ పార్టీని ఎవరు నడిపించాలనే దానిపై కేసీఆర్ కూడా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనేక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ కేసు ఊరికే ముగిసేది కాదు. దర్యాప్తు జరుగుతూ పోతుంటే, మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చేట్లున్నాయి. ఇలాంటి స్థితి కనిపిస్తున్న సందర్భంలో కేటీఆర్ చాలా అసహనానికి గురవుతున్నారని ఆయన ఎదురుదాడి విమర్శను బట్టి అర్థం చేసుకోవచ్చు. పైసా అవినీతి జరగలేదు..ప్రభుత్వ పరంగా జరగాల్సిన విచారణలో అవినీతి ఎక్కడుందని, ఇంకా గట్టిగా వాదిస్తూ.. లొట్టపీసు కేసు అని పదేపదే చెబుతున్నారు. ఇది ఆయనలోని అసహనాన్ని బయటపెడుతున్నాది. ఆయన లాయర్లు ఇది లొట్టపీసు కేసు కదని చెప్పే ఉంటారు. పదేపదే ఇదే పదం వాడుతూ, సిఎం ర ఏవంత్ రెడ్డిని కూడా అనరాని మాటలతో విమర్శలు చేసన్తా.. తనలోని ఇకపోతే÷–స్టేషన్‌ను బయటపెట్టుకుంటున్నారు. వందిమాగధులు చేరి, ఎంతగా ఎదురుదాడికి పూనుకున్నా ఈ లొట్టపీసు గట్టి కేసు అని ముమ్మందు రుజువు కాబోతున్నదనడంలో సందేహం అక్కర్లేదు. కపోతే ఈ లొట్టపీసు కేసులో 'విదేశీ కంపెనీకి పురపాలకశాఖ నేరుగా నిధులు చెల్లిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయిన కేటీఆర్‌కు తెలియంది కాదు. కెటిఆర్ కూడా మళ్లీ తామే అధికారంలోకి వచ్చేది కనుక ఏమీ కాదన్న ధోరణిలో అతి విశ్వాసంతో ,,,అంతా తాను చూసుకుంటానని ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు భరోసా ఇచ్చి వుంటారు. ప్రజాధనం దుర్వినియోగమవుతుంటే కాపాడలేకపోవడం వాస్తవమే అన్న నిజాన్ని ఈ లొట్టపీసు కేసులో ఏ2గా ఉన్న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ గుర్తించి వుంటారు. ఎసిబి విచారణలో ఆయన తప్పకుండా నిజాలు చెప్పేవుంటారు. కేబినెట్ ఆమోదం లేకపోవడం, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకపోవడం వంటివి కెటిఆర్ మంత్రిగా తెలుసుకోకుండా చేసిన పనులు. అయితే ఏమీ కాదులే ..అంత మనదే రాజ్యం అన్న ధీమాలో కెటిఆర్ ఉండివుంటారు. అంతేనా అంటే ఇక కాబోయే సిఎంను నేనే అని కూడా భావించి ఉంటారు. అందుకే ఈ బరితెగింపు నిర్ణయం తీసుకుని ఉంటారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఎక్కువగా డాక్యుమెంట్లు, ఇతర ఆధారాల అనుగుణంగానే విచారణ జరుగుతుంది. ఇలాంటి విషయాలు ఏవైనా అరవింద్ కుమార్ ఎసిబికి అందించివుంటే .. కేటీఆర్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయినట్లేనని భావించాలి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినతర్వాత ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి లేదు. అలాంటిది ఓ విదేశీ కంపెనీకు డబ్బు చెల్లింపులు చేయడం మరీ నేరం. ఇకపోతే ఫార్ములా– ఈ కార్ రేసింగ్ స్కాంలో ప్రాథమిక ఆధారాలున్నట్టు హైకోర్టు స్పష్టం చేయడం బీఆర్ఎస్‌ను వణికిస్తోంది. గత వారం రోజులుగా కేటీఆర్ ప్రదర్శిస్తున్న అసహనం ఆయన తప్పును బయటకు వెల్లడిస్తోంది. తనతోపాటు తన అడ్వకేట్లను అనుమతిస్తేనే విచారణకు హాజరవుతానని మొండికేయడం, విచారణకు రాకుండా వెనక్కి వెళ్లిపోవడం ద్వారా ఆయన తన దురుసుతనాన్ని ప్రదర్శించారు. ఈ కేసు మొదలయినప్పటి నుంచి గమనిస్తే...చట్టాలకు తాము అతీతులమనే అహంభావం ఆయన ప్రవర్తనలో కనిపిస్తున్నది. అంతేకాదు.. ఈ వ్యవహారంలో ఏసీబీ, ఈడీ కేసులు నమోదుచేసిన నాటి నుంచి కేటీఆర్ మీడియా ముందు దురుసుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ కేసు ను ఓ లొట్టపీసు కేసుగా అభివర్ణించారు. ఆయనో లొట్టపీసు ముఖ్యమంత్రి అంటే ఇంకా పలురకాలుగా నోరుపారేసుకుంటూనే ఉన్నారు. ఎసిబి విచారణ నుంచి బయటకు వస్తున్న సందర్భంలో మీడియాతో మాట్లాడ వద్దన్నందుకు కూడా నోరుపారేసుకున్న తీరును చూశాం. కేసులకు, జైళ్లకు భయపడేది లేదని అంటూ వీరావేశం ఎత్తుతున్నారు.కానీ, ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు చుట్టూ తిరుగుతుండటం చూస్తే.. కేసులో దమ్ముందని, తనకు చుట్టుకుంటోందని గమనించి ఉంటారు. అందుకే కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు బయలుదేరుతూ, ఎసిబి విచారణ నుంచి వచ్చిన తరవాత కూడ మీడియా ముందుకువచ్చి, ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని విచక్షణా రహితంగా దూషించిన తీరు సభ్యసమాజం సిగ్గుతో తలదించు కునేలా చేసింది. కేసును రాజకీయ ప్రేరేపిత కుట్రగా చూపే ప్రయత్నంలో భాగంగా అసభ్యకర వ్యాఖ్యలను, అసంబద్ధ సవాళ్లను చేస్తున్నారు. నిజానికి నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయపన్ను శాఖకు రూ. 8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇక కెటిఆర్ స్థానంలో ఎవరుండి పార్టీని నడపాలన్నది వారి ముందున్న సమస్య. బహుశా కవిత ఈ భారన్ని భుజాన వేసుకునే అవకాశం లేకపోలేదు.

# టీటీడీ ఈవో శ్యామలరావుపై,జేఈవో వెంకయ్య చౌదరిపై బదిలీ వేటు?



తిరుపతి:తప్పొప్పులకు బాధ్యత ఎవరిది అన్న విషయాన్ని పక్కన పెడితే తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాట ఎంత కాదనుకున్నా ప్రభుత్వ ప్రతిష్ఠను ఒకింత మసకబార్చింది. కూటమి పార్టీలలో కూడా తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఎవరి వాదన వారిదన్నట్లుగా కనిపిస్తోంది. తొక్కిసలాట బాధితులను పరామర్శించేందుకు ఒకే రోజు తిరుపతిలో పర్యటించిన తెలుగుదేశం, అధినేత ముఖ్యమంత్రి, జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు తమదైన శైలిలో ఘటనపై స్పందించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొక్కిసలాటకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకునే విషయంలో అధికారుల కంటే ప్రత్యక్ష సాక్షులు, ఈ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి నుంచి సమాచారం తీసుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సంఘటనకు బాధ్యులు ఫలానా వారని చెప్పకుండానే.. మీడియా సమక్షంలోనే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్వయ లోపం ఎందుకొచ్చిందని నిలదీశారు. ఎస్పీపై అయితే ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా పద్ధతి మార్చుకోరా? ఏం తమాషాగా ఉందా అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరో వైపు పవన్ కల్యాణ్ తిరుపతి తొక్కిసలాటకు బేషరతు క్షమాపణలు చెప్పారు. బాధితులను ఆదుకుంటామనీ, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామనీ చెబుతూనే.. టీటీడీలో వీఐపీ యాటిట్యూడ్ మారాలని కుండబద్దలు కొట్టారు. ఈ ఘటనకు ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరిల మధ్య సమన్వయ లోపమే కారణమని ఎత్తి చూపారు. అలాగే పోలీసుల వైఫల్యం కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కొందరు పోలీసులు బాధ్యతగా వ్యవహరించినా, కొందరు మాత్రం తొక్కిసలాట సమయంలో ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. ఇక పోతే తిరుపతి తొక్కిసలాటకు ఎవరు కాదన్నా, ఔనన్నా బాధ్యత వహించాల్సింది మాత్రం తిరుమల తిరుపతి దేవస్థానమే. టీటీడీలో ఆల్ ఈజ్ నాట్ వెల్ అన్న సంగతి సీఎం సమీక్షలోనే ప్రస్ఫుటంగా బయటపడింది. ఆ సమీక్షలో ఏకంగా సీఎం ముందే టీటీడీ చైర్మన్, ఈవో శ్యామలరావులు వాగ్వాదానికి దిగారు. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ ఈవోపై చంద్రబాబుకు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరినీ మందలించారు. టీటీడీ చైర్మన్, ఈవో శ్యామలరావుల మధ్య సమన్వయం లేదన్న వార్తలు గత కొంత కాలంగా బలంగా వినిపిస్తున్నాయి. పాలకమండలి సభ్యులే ప్రైవేటు సంభాషణల్లో పలు మార్లు ఈ విషయంపై చర్చించుకున్నారు. ఆ కారణంగానే వైకుంఠ ద్వార దర్శనం టోకోన్ల జారీ కేంద్రం వద్ద తొక్కిసలాట జరిగింది. టోకెన్ల జారీ కేంద్రం తలుపులు ఎప్పుడు తెరవాలి, పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను ఎలా నియంత్రించాలి అన్న దానిపై ఎవరికి తోచినట్లు వారు ప్రకటనలు చేయడంతో, ఈ విషయంలో పనుల పరిశీలన, సమీక్షల్లో కూడా ఎవరి దారి వారిదే, ఎవరిగోల వారిదే అన్నట్లుగా సాగడంతో కింది స్థాయి అధికారులలో గందరగోళం ఏర్పడిందంటున్నారు. తొక్కిసలాట ఘటన అనంతరం ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. ప్రాథమిక నివేదిక ఆధారంగా ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేయీవో గౌతమిలపై ప్రభుత్వంబదిలీ వేటు పడింది. టీటీడీ చీఫ్ సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ అధికారి శ్రీధర్ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించానే కారణంతో ఆయననూ బదిలీ చేశారు. ఇక ప్రాథమిక నివేదికలో తొక్కిసలాటకు కారణం డీఎస్పీ రమణ బాబు అన్న కలెక్టర్ నివేదికతో ఆయనను సస్పెండ్ చేశారు. అలాగే నిర్లక్ష్యంగా వ్యవహరించిన గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డిపై కూడా సస్పెన్షన్ వేటు వేశారు. అయితే తొక్కిసలాట ఘటనకు సంబంధించి మరింత మందిపై చర్యలు ఉంటాయన్న చర్చ కూడా జరుగుతోంది. మరీ ముఖ్యంగా టీటీడీ చైర్మన్ లో సమన్వయం లేకుండా వ్యవహరించిన ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరిలపై కూడా బదిలీ వేటు పడే అవకాశం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. భక్తుల సౌకర్యాలు, భద్రత కంటే తమ సొంత ఇగో శాటిస్ ఫ్యాక్షన్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారన్న భావన టీటీడీ పాలకమండలి సభ్యుల నుంచి బలంగా వ్యక్తం అవుతున్న నేపథ్యంలో వారిరువురిపై కూడా బదలీ వేటు పడే అవకాశం ఉందని అంటున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఘోరం.. ఆస్తి వివాదంలో జర్నలిస్ట్ కుటుంబం హత్య



ఛత్తీస్‌గఢ్:ఛత్తీస్‌గఢ్‌లో దారుణం జరిగింది. ఆస్తి వివాదంలో జర్నలిస్టు కుటుంబం దారుణ హత్యకు గురైంది. ఆజ్‌తక్ జిల్లా రిపోర్టర్ సంతోష్ కుమార్ టోప్పో తల్లిదండ్రులు, సోదరుడు ప్రాణాలు కోల్పోయారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని సూరజ్‌పూర్‌లో ఆస్తి వివాదం చెలరేగింది. అయితే సంతోష్ మాఘే టోప్పో (57), బసంతి టోప్పో (55), అతని సోదరుడు నరేష్ టోప్పో (30) వ్యవసాయం పొలానికి వెళ్లారు. అయితే పొలం కుటుంబ కలహాలకు కేంద్రంగా ఉంది. దీంతో ప్రత్యర్థులు కత్తులు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో సంతోష్ తల్లిదండ్రులతో పాటు సోదరుడు ప్రాణాలు కోల్పోయారు. బసంతి, నరేష్ తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మాఘేను మాత్రం అంబికాపూర్ మెడికల్ కాలేజీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏడుగురు వరకు గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసినట్లుగా సమాచారం. మరో సోదరుడు ఉమేష్ టోప్పో దాడి నుంచి తప్పించుకుని గ్రామస్థులకు సమాచారం అందించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆస్తి విషయంలో కొన్ని నెలల నుంచి వివాదం నడుస్తోంది. ప్రస్తుతం కేసు న్యాయస్థానంలో ఉంది. అయితే తీర్పు రాకముందే నిందితులు వ్యవసాయం చేస్తున్నారని.. దీంతో సంతోష్ కుటుంబం అడ్డుకునే ప్రయత్నం చేసింది. ఈ ఘర్షణలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దాడి సమయంలో రిపోర్టర్ సంతోష్ అక్కడ లేడు. ఖర్గవా, ప్రతాపూర్‌కు చెందిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బొత్స అనుభవం ఏదంటూ మంత్రి ఆనం ఫైర్..



అమరావతి,తిరుపతి తొక్కిసలాట వ్యవహారంపై అధికార–విపక్షాల మధ్య మాటలు తారాస్థాయికి చేరాయా? ఈ ఘటనను తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందా? ఎందుకు వైసీపీ ప్లాన్‌లు బూమరాంగ్ అవుతున్నాయి? చివరకు సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్సకి గట్టిగా మంత్రి ఆనం కౌంటర్ వెనుక అసలేం జరిగింది?ఏపీలో రాజకీయాలు వేరుగా ఉంటాయి. ఒకరిపై మరొకరు పైచేయి సాధించే క్రమంలో పార్టీలు అభాసు పాలవుతున్నాయి. అందుకు ఎగ్జాంఫుల్ తిరుపతి తొక్కిసలాట ఘటన. అనుకోకుండా ఘటన జరిగింది.. ఆరుగురు చనిపోయారు, 40 మందికి పైగా గాయపడ్డారు. బాధితులు దర్శనం తర్వాత వైసీపీ వాయిస్ రైజ్ చేసింది.జగన్, ఆ పార్టీ నేతల వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. ఓ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మంత్రి ఆనం, వైసీపీ వ్యవహారంపై దుమ్మెత్తిపోశారు. రాజకీయ మనుగడలో జగన్ లేరని తేల్చేశారు. దారి దోపిడీ విధానాలతో ఆ పార్టీ నడుస్తోందని, ప్రజాస్వామ్యంలో ఆయనకు స్థానమే లేదన్నారు. బాధితులను పరామర్శించాల్సింది పోయి కవర్లు ఇస్తారా అంటూ మండిపడ్డారు.మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాటలపై రియాక్ట్ అయ్యారు మంత్రి ఆనం. సీనియర్ నాయకుడు బొత్స.. వాళ్ల నాయకుడి గురించి కనీసం అవగాహన లేదన్నారు. ఆ పార్టీలో ఆయన అవగాహన లేని నాయకుడి కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు. దేవాదాయ శాఖ గురించి బొత్స పూర్తిగా లేదన్నారు. తన శాఖలో ప్రక్షాళన జరుగుతోందని, అన్ని ఉత్సవాలకు పాలక వర్గాలతో కలిసి పని చేస్తున్నామన్నారు.తిరుమలలో పాలక వర్గం ఉందని, స్వయం ప్రతిపత్తి గలిగిన సంస్థ అక్కడి వ్యవహారాలను చూస్తోందన్నారు మంత్రి. సలహాలు, సూచనలు అడిగితే తప్పకుండా ఇస్తామన్నారు. బొత్స మంత్రిగా ఉన్నప్పుడు ఆయన వద్ద పని చేసిన అధికారి, తిరుమలలో ఎగ్జిక్యూటివ్ అధికారి ఉన్నారని, కాదని చెప్పగలరా అంటూ ప్రశ్నించారు.దసరా, బ్రహ్మోత్సవాలు సమయంలో తిరుమల పాలకమండలి జాగ్రత్తగా పని చేసిన తీరును గుర్తు చేశారు మంత్రి ఆనం. ఇలాంటి సమయంలో పాలకవర్గం బాగా పని చేస్తుందని తాము ఆశించామని, దురదృష్టమైన ఘటనను పట్టుకుని ప్రభుత్వంపై నిందలు వేయడం, దేవాదాయ శాఖను ప్రశ్నించడం అంతకన్నా దిగజారుడు తనం మరొకటి ఉండదన్నారు.సీనియర్ రాజకీయ నాయకుడు బొత్స, ఈ స్థాయికి దిగజారుతారని తాను ఊహించలేదన్నారు. ఆయనను చూసి జాలి వేస్తుందని, బాధపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇంతకీ బొత్స ఏమన్నారు? వైకుంట ద్వార దర్శనం ఏర్పాట్లపై సమీక్ష చేయలేనంత తీరిక దేశాదాయ శాఖ మంత్రి ఉన్నారా అంటూ ప్రశ్నించారు.వైసీపీ మొదటి నుంచి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు తొలగించాలని డిమాండ్ చేస్తోంది. వారిపై రక రకాలుగా బురద జల్లుతోంది. స్వయంగా జగన్.. అప్పటి తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు పై మండిపడ్డారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత సప్త సముద్రాలు దాటినా ఏపీకి తీసుకొచ్చి ఆయనను శిక్షిస్తామన్నారు. జగన్ చెప్పిన 45 రోజుల వ్యవధిలో ఈ ఘటన చోటు చేసుకుంది.

# బల్దియా ఖజానాకు సర్వే గండి!



హైదరాబాద్, మూలిగే నక్కపై తాటి పండు పడిందన్న చందంగా 'ఇందిరమ్మ ఇండ్ల సర్వే' బల్దియాకు సరికొత్త తంటాను తెచ్చిపెట్టింది. సంస్థకు ప్రధాన ఆదాయ ఆస్తిపన్ను వసూళ్లపై ఈ సర్వే ప్రభావం పడుతున్నది. ప్రభుత్వం గడిచిన కొన్ని నెలలుగా ఆస్తిపన్ను వసూళ్లలో కీలకమైన బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు వరుసగా వస్తున్న సర్వే అదనపు భారం పడుతున్నది. వీరు ఒక పక్క సర్వేలు, మరో పక్క ట్యాక్స్ వసూలు పనులు చేయాల్సి ఉంది.సర్వే కారణంగా ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదని అంటున్నారు. గడిచిన రెండు, మూడు నెలలుగా నెలవారీగా ఆస్తిపన్ను రూ. 50కోట్లు దాటడం లేదని అధికారులు చెబుతున్నారు. వసూళ్లు తగ్గడంతో సంస్థ ఖజానాపై తీవ్ర ప్రభావం పడి.. నెలవారీ వేతనాలు సకాలంలో అందాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలోనే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వేతో ఆస్తిపన్ను వసూళ్లు సరిగా లేకపోవడం, రాబోయే రోజుల్లో 26వ తేదీ నుంచి రేషన్ కార్డుల సర్వే, అనంతరం పింఛన్ల సర్వే, గృహలక్ష్మి సర్వే కూడా జరగాల్సి ఉంది.

వైట్ నోటీసులు జారీ..

మొత్తం 19.49 లక్షల ప్రాపర్టీలు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ. 1407 కోట్ల ఆస్తిపన్ను వసూలైంది. 12 లక్షల మంది ఆస్తిపన్ను చెల్లించారు. మార్చి 31 నాటికి రూ. 563 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అత్యధికంగా శేరిలింగంపల్లి, చందానగర్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రధానంగా దృష్టి సారించారు.

దాదాపు ఆరు లక్షల మందికి వైట్ నోటీసులు జారీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలల 20 రోజుల సమయం ఉంది. ఈ ఏడాది టార్గెట్ రూ. 1970 కోట్లలో ఇంకా రూ. 563 కోట్ల కలెక్షన్లు రావాల్సి ఉంది. మార్చి 31 వరకు లక్ష్యాలను చేరుకోవాలని సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లకు కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. అయితే నిర్ణీత సమయంలో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం చేరడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జీతాలు పెంచుతామంటూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాల్స్

జీహెచ్‌సీలో నయా దందా మొదలైంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే లక్ష్యంగా అక్రమ వసూళ్లకు తెరలేపారు. గడిచిన కొద్ది రోజులుగా జీహెచ్ఈ జోనల్, సర్కిల్ అన్ని కార్యాలయాల్లోని ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు జీతం పెంచుతామని కొందరు కాల్స్ చేస్తున్నారు. 625 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జాబితాను దగ్గర పెట్టుకుని జీతం పెంచుతాం, అందుకు రూ. వెయ్యి నుంచి రెండు వేల వరకు రేటును ఖరారు చేశామని చెబుతూ.. గూగుల్ పే నంబర్ పంపుతూ వసూళ్లకు పాల్పడుతున్నారు.జీతం పెరిగిన తర్వాత రెండు నెలల జీతం అందించింది. ఈ నేపథ్యంలోనే కొందరు ఇప్పటికే డబ్బులు సమర్పించుకోగా, కొందరు సందిగ్ధంలో ఉన్నామని జీహెచ్‌పీకి మరి ప్రధాన పోటీని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ వసూళ్ల దందాలో నల్గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనుచరులు ఉన్నారని, ఓ మహిళా నేత జీహెచ్ఎల్ ప్రధాన అడ్మిన్ అడ్మిన్ పరిధిలో కొందరి ప్రమేయంలో ఇటువంటి ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ అంశం హాట్ టాఫిక్‌గా మారింది.

# పొంగల్ దోపిడీ : రాజమండ్రికి రూ. 4వేలు, వైజాగ్ కు రూ.6వేలు!



హైదరాబాద్,సంక్రాంతి పండగకు హైదరాబాద్ నుంచి ఊరెళ్లాలనుకునే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే టీజీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తుంది. పోనీ రైళ్లలో వెళ్లాలి అనుకుంటే ఛార్జీ ధరలు అందుబాటులోఉన్నా.. రద్దీ ఫుల్ గా ఉంది. మూడు నెలల కిందటే సీట్లన్ని బుక్ అయిపోయాయి. 162 స్పెషల్ రైళ్లను నడుపుతన్నప్పటికీ రిజర్వేషన్‌లో సీటు దొరకడం లేదు. దీంతో చాలామంది జనాలు ప్రైవేటు ట్రావెల్స్ లనే నమ్ముకున్నారు. అయితే దీన్నే ఆసరాగా చేసుకోని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు పొంగల్ దోపిడీ షురూ చేశారు. రేట్లు అమాంతం పెంచేశారు. ధరలుల చూసి ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

రాజమండ్రికి రూ. 4వేలు, వైజాగ్ కు రూ. 6వేలు

హైదరాబాద్ నుంచి రాజమండ్రికి రూ. 4వేలు, వైజాగ్ కు రూ. 6వేలుగా వసూలు చేస్తున్నారు. ఇక విజయవాడకు రూ. 3 వేల లోపుంటే.. ప్రస్తుతం రూ. 6 వేలు వసూలు చేస్తున్నారు. మాములుగా అయితే హైదరాబాద్ నుంచి రాజమండ్రికి రూ. 1000 ఛార్జీ ఉంటుంది. ఇక వైజాగ్ కు అయితే తక్కువలో తక్కువ రూ. 2 వేలు ఉంటుంది. కానీ ఈ ప్రైవేటు ట్రావెల్స్ లో ఇప్పుడు ఇంటికి వెళ్లాలంటే త్రిబుల్ ఛార్జీలు పెట్టుకోవాల్సిందే. ఇక ఫ్యామిలీతో ఇంటికి వెళ్లాలంటే సామాన్యుడు అయితే నెల జీతం ఖర్చు చేయాల్సిందే. ఇక హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే సుమారుగా రూ. 4 వేలుగా ఛార్జీలున్నాయి. దీంతో పండగ పుణ్యామా అని మూడు పువ్వులు ఆరు కాయాలు అన్నట్లుగా ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులకు వ్యాపారం సాగుతోంది. ఇక విమాన ఛార్జీల విషయానికి వస్తే హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ. 14వేలకు పైనే ఉండగా.. అదే రాజమండ్రికి రూ. 22 వేలు ఉంది. సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని టీజీఎస్ఆర్టీసీ స్పెషల్ గా 6 వేల 432 బస్సులను నడుపుతుండగా.. ఏపీఎస్ఆర్టీసీ 7 వేల200 బస్సులను నడుపుతునట్లుగా వెల్లడించాయి. అయితే పండగను క్యాష్ చేసుకుని సొమ్ము చేసుకునేందుకు ఆర్టీసీ రెడీ అయినట్టు తెలుస్తోంది. ఇంటికెళ్లే వారికి శుక్రవారం నుంచి బస్సు టికెట్ ధరలను అమాతంగా ఒకటిన్నర శాతం పెంచేసింది. అయితే ఏపీఎస్ ఆర్టీసీ ఎలాంటి ఛార్జీలు పెంచకుండా . సాధారణ ఛార్జీలతోనే నడుపుతుండటం ఊరటనిస్తుంది కానీ డిమాండ్?కు తగ్గట్టుగా బస్సులు అందుబాటులో లేకపోవడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## చదువుతోపాటు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన ఉండాలి

పశ్చిమగోదావరి,చదువుతోపాటు విద్యార్థులకు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. నర్సాపురం వైఎన్ కళాశాల డైమండ్ జూబ్లీ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పురందరేశ్వరి హాజరయ్యారు. కళాశాల ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహం ఆవిష్కరణ గావించారు. భోగి మంటలు వెలిగించి విద్యార్థులతో సంక్రాంతి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పురందరేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులకు సమగ్రమంతమైన, వికాసవంతమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com